నేడు ప్రొద్దుటూరులో చంద్రబాబు సభ



కడప ప్రతినిధి : టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రొద్దుటూరు పట్టణంలో శనివారం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు. టిడిపి జిల్లా నాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాగళం సభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నెల్లూరు జిల్లా వింజమూరు నుంచి హెలీకాప్టర్‌లో ప్రొద్దు టూరుకు చేరుకుంటారు. అనంతరం పుట్టపర్తి సర్కిల్‌లో జరిగే సభలో ప్రజల నుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటకు వెళ్లనున్నారు. ముందుగా నిర్ణయించిన మేరకు మైదుకూరు సభలోనూ చంద్రబాబు పాల్గొనాల్సి ఉంది. రోజుకు నాలుగు సభల్లో పాల్గొనడం ఇబ్బందిగా ఉన్నట్లుగా భావించి మూడింటికి కుదింపుతో మైదుకూరు సభను వాయిదా వేశారు.

టిడిపి అభ్యర్థులు వీరే

కడప ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి
రాజంపేట అసెంబ్లీ బరిలో 'సుగవాసి'

చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి

సుగవాసి బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు పెండింగ్ టికెట్లను టిడిపి ప్రకటించింది. శుక్రవారం కడప పార్లమెంట్, రాజంపేట అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. మూడు విడతలుగా జిల్లాలోని రాజంపేట పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. మిగిలిన ఐదు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో నాలుగింట్లో ఒకటి జనసేన, మూడు స్థానాలను బిజెపికి కేటాయించింది. తాజా విడతలో కడప పార్లమెంట్, రాజంపేట అసెంబ్లీ స్థానాలకు ఊహించని అభ్యర్థులను ఎంపిక చేసింది. ఎటువంటి రాజకీయ అనుభవం లేని యువకుడిని పార్లమెంట్‌కు, అనుభవం కలిగిన నాయకుడిని బిజెపి చాటున అసెంబ్లీ బరిలో పోటీకి నిలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలోని వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ధీటైన అభ్యర్థులను ఎంపిక చేయడంలో టిడిపి తడబాటు పడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కడప పార్లమెంట్ బరిలో జమ్మలమడుగుకు చెందిన చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా రాయచోటికి చెందిన సుగవాసి సుబ్రమణ్యం పేర్లను ప్రకటించడం గమనార్హం. కడప పార్లమెంట్ స్థానానికి వైసిపి తరుపున సిట్టింగ్ ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి పోటీ చేయనున్న సంగతి తెలిసిందే. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు గత ఐదేళ్లుగా వైఎస్.అవినాష్‌రెడ్డిపైనే విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టిన సంగతి తెలిసిందే. ఇటువంటి నాయకునికి ధీటుగా సమర్థుడైన సీనియర్ నాయకుడిని ఎంపిక చేయడంలో చేతులెత్తేసింది. జమ్మలమడుగు అసెంబ్లీ అభ్యర్థిత్వానికి చివరి వరకు పోటీపడిన చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేరును పార్లమెంట్ స్థానానికి అభ్యర్థిగా ప్రకటించారు. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిని పార్లమెంట్ బరిలో నిలపకుండా, అసెంబ్లీ ముఖమే ఎరగని, యువకుడిని పార్లమెంట్ బరిలో నిలపడమేమిటో, ఏ పాటి సర్వేలపై ఆధారపడి ఎంపిక చేశారో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది.

రాజంపేట అసెంబ్లీ స్థానానికి సుగవాసి సుబ్రమణ్యం పేరును ప్రకటించారు. రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా బత్యాల చెంగల్రాయుడు, జగన్మోహన్‌రాజు పేర్లు హోరాహోరీగా పోటీ పడిన సంగతి తెలిసిందే. పారిశ్రామిక వేత్త గంటా నరహరి పేరు సైతం చక్కర్లు కొట్టింది. ఇటువంటి ఆర్థిక, అంగ, అనుచర బలం కలిగిన ప్రత్యర్థులను కాదని రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారం సాగిన అభ్యర్థి పేరును అసెంబ్లీ బరిలో నిలిపారు. వైసిపి రాజంపేట అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని బరిలో నిలిపింది. ఈయనకు దీటైన అభ్యర్థిగా బత్యాల చెంగల్రాయుడు నియోజకవర్గ వ్యాప్తంగా గుర్తింపు, కేడర్ ఆదరణ కలిగి ఉన్నారు. ఇటువంటి అభ్యర్థిని బరిలో నిలిపి ఉంటే టిడిపి గెలిచే అవకాశాలు ఉన్నాయనే అంచనాలు ఉన్నాయి. ఇటువంటి అభ్యర్థిత్వాన్ని ఎంపిక చేయకుండా టిడిపి గెలుపు అవకాశాలను తల్లకిందులు చేయడం చర్చనీ యాంశంగా మారింది.

భగ్గుమన్న అసమ్మతి సెగలు

టిడిపి కరపత్రాలను దహనం చేస్తున్న బత్యాల అనుచరులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి అసెంబ్లీ అభ్యర్థి ఆశావహుల నిరీక్షణకు శుక్రవారం తెరపడింది. సీనియర్ నాయకులు పాలకొండ రాయుడు తనయుడు సుగవాసి సుబ్రహ్మణ్యంను టిడిపి రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా అధిష్టానం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. టిడిపి టికెట్ ఆశిస్తూ ఎంతో మంది ఆశావాకులకు నిరాశే మిగిలింది. రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మో హన్‌రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగలరాయుడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాక్షేత్రంలో పర్యటిస్తూ ప్రజాభిమానానికి చేరు వవుతూ పార్టీ భావజాలాన్ని, అధికార పార్టీ ప్రజా వ్యతిరేక విధా నాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. వారిని కాదని సుగవాసి సుబ్రహ్మణ్యంకు టికెట్ కేటాయించడంతో రాజంపేట టిడిపి శ్రేణులలో ఒక్కసారిగా అసంతృప్తితో కూడిన నిరసనలు భగ్గుమన్నాయి. టిడిపికి చెందిన కరపత్రాలను పట్టణంలో బత్యాల అనుచరులు దహనం చేశారు.

'బత్యాల'కు టికెట్ ఇవ్వకుంటే రాజీనామాలు : అద్దేపల్లి

నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడుకు టికెట్ ఇవ్వకుంటే రాజీనామాలు చేస్తామని టిడిపి అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు అన్నారు. శుక్రవారం తాళ్లపాకలోని స్వగృంలో విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికలలో ఓటమిపాలైనప్పటికీ బత్యాల నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌ను బలపరుస్తూ కష్ట సమయాలలో కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని ముందుకు నడిపించారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిని కాదని స్థానికేతరుడైన సుగవాసికి టికెట్ కేటాయించడం వలన రానున్న ఎన్నికలలో టిడిపి ఓటమి తధ్యమని, ఎన్నికలలో ఏజెంట్లను కూడా నియమించుకోలేని పరిస్థితి టిడిపికి రానున్నదని తెలిపారు. అధిష్టానం పునరాలోచించుకుని బత్యాలకు టికెట్ కేటాయించాలని, లేనిపక్షంలో రాజీనామాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు బత్యాలకు టికెట్ కేటాయించాలని కోరుతూ బత్యాల భవన్ మేడ పైకి ఎక్కి నిరసన తెలిపారు.

మాట్లాడుతున్న టిడిపి అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్‌రాజు

చేనేత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

బాధ్యులను కఠినంగా శిక్షించాలి
వృత్తి సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వృత్తి సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య అన్నారు. శుక్రవారం ఒంటిమిట్ట మండలం మాధవరంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పాల సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఒక్కొక్కరికి రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. 3.10 ఎకరాల భూమి వారి కుటుంబానికి చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుబ్బారావు పెద్ద కుమార్తె పాల లక్ష్మీప్రసన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే విధంగా ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత వృత్తినే అగాధంలోకి తోసేశారన్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఇన్సూరెన్స్‌లు రద్దు చేయడం గాని, నూలుపైన 19 శాతం, పట్టుపైన ఐదు శాతం జిఎస్టి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పించకపోగా సంక్షేమంలో భాగమైన చేనేత కార్మికులకు ఇచ్చే రాయితీలు కూడా కోత పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశాలే చేనేత కార్మికుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఉందని విమర్శించారు.

సుబ్బారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భాస్కరయ్య

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ మాట్లాడుతూ చేనేతకు గతంలో చట్టం చేసిన 11 రకాల బట్టలకు పవర్‌లూమ్ నుంచి మినహాయించి హ్యాండ్లూమ్‌కే హక్కుగా ఉంచాలని జగనన్న నేతన్న నేస్తం చేనేత కుటుంబాల అందరికీ షరతులు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు వర్క్ ష్రం షెడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్ పార్కులో అభివృద్ధిపరిచి ఉపయోగంలోకి తీసుకు రావాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న సుబ్బారావు కుటుంబానికి కలెక్టర్ అధ్యక్షతన న్యాయ విచారణ జరిపి ఆత్మహత్యకు ముందు సుబ్బారావు రాసిన లేఖని మరణ వాంగ్మూలంగా స్వీకరించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.నర్సయ్య, సహాయ కార్యదర్శి సురేష్‌బాబు, సాంబయ్య పాల్గొన్నారు.

బస్సు యాత్రపై ఆరోపణలు తగవు : వైసిపి

మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి

ప్రజాశక్తి - వేంపల్లె

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో జనాలు లేరని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారని, కాబట్టి టిడిపి నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు పథకంలో ఆసుపత్రికి వెళ్లి కంటి పరీక్షలు చేసుకొంటే జనాలు ఉన్న విషయం తెలుస్తుందని జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సిఎం యాత్రలో 700 మంది కంటే ఎక్కువగా లేరని చెప్పడం టిడిపి నాయకుల అవివేకానికి నిదర్శనం అన్నారు. బస్సు యాత్రకు వేంపల్లెలో 12 వేలు మంది వచ్చారని ఇంటెలిజెన్స్ అధికారులు కూడా నివేదికలు ఇచ్చారని పేర్కొన్నారు. బస్సు యాత్ర పార్టీ కార్యక్రమాన్ని చెప్పారు. దళితులకు వైసిపి ఎక్కడా అవమాన పరచలేదని చెప్పారు. కళ్ళు లేని కబోది లాగా టిడిపి నాయకులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహించే బస్సు యాత్రలో ఎక్కడా ఎంపిపిలను, సర్పంచులను బస్సులో ఎక్కించడం లేదని చెప్పారు. సిఎం, ఎంపిలను క్షమాపణలు చెప్పాలని కోరడం ఆరోపణలు చేసిన టిడిపి నాయకులకు అర్హత లేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటో కాల్ ను విస్మరించలేదని చెప్పారు. ఇడుపులపాయ నుంచి ప్రొద్దుటూరు వరకు జనాలు సిఎంకు నిరాజనాలు పలికారని చెప్పారు. లేని పోని ఆరోపణలు చేయడం తగదని చెప్పారు. వైసిపి దళితులకు మొదట ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధిపై విమర్శలు చేయడం తగదని చెప్పారు. పనులు జరిగే సమయంలో కొన్ని ఇబ్బందులు జరగడం సహజమని వాటిని భూతద్దంలో చూపించడం అలవాటు అయ్యిందని చెప్పారు. ఎంపిపి లక్ష్మి గాయత్రీ మాట్లాడుతూ సిఎం, ఎంపీ ఇద్దరూ దళిత ఎంపిపిని అవమాన పరిచినట్లు టిడిపి నాయకులు ఆరోపించడం సిగ్గుచేటన్నారు. బస్సు యాత్ర ప్రారంభం సమయంలో ఇడుపులపాయలో లేక పోవడం వల్లనే తాను బస్సులో ఎక్కలేక పోయానని చెప్పారు. టిడిపి నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌సి కాలనీ వద్ద తనను చూసిన సిఎం బస్సును కొద్ది సేపు ఆపడం జరిగిందని చెప్పారు. దళితులకు అనేక పదవులు సిఎం జగన్ ఇచ్చారని విషయాన్ని టిడిపి నాయకులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఆరోపణలు చేసేటప్పుడు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని చెప్పారు. విలేకరుల సమావేశంలో సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి, హజ్ హౌస్ డైరెక్టర్ మునిర్, మాజీ ఉపసర్పంచ్ మునీర్, ఎంపిటిసిలు రహంతుల్లా ఖాన్, కటిక చంద్ర శేఖర్, భారతి, శ్రీనివాసులు, ఖదీర్, నిసార్ బాషా, మణి గోపాల్ రెడ్డి, జయరాం, హబిబుల్లా పాల్గొన్నారు.

పేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక జండామాన్ వీధిలోని జామియా మసీద్ వద్ద శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ సొంత నిధులతో రంజాన్ పండుగ సందర్భంగా సుమారు 70 పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి ముస్లిం అధ్యక్షులు నూరుల్లా మాట్లాడుతూ చైర్మన్ వరప్రసాద్ సేవలు మరచిపోలేమని, గత నాలుగేళ్ల నుంచి ముస్లిం పేద ప్రజలు పండగ రోజు సంతోషంగా ఉండాలని ప్రతి సంవత్సరమూ సుమారు 50 కుటుంబాలకు నిత్యాసర సరుకులు ఇస్తూ పేద ప్రజలపై తమ ప్రేమాభిమానాన్ని చాటుకుంటున్నారని చెప్పారు. ముస్లిం కుటుంబాలకు తన వంతుగా సహాయం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ ఓ.రసూల్, ఆతిక్ మసీదు ముత్తవల్లీ, షబ్బీర్, ముస్లిం సోదరులు కార్యకర్తలు ఖాదర్ వలీ,షఫీ నూరు, ఖలీల్ , సలాం, డోనాల్డ్ సాదిక్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు..

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కిరాణా కొట్టు యజమాని ఎన్. శివప్రసాద్ జన్మదిన సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర సరులకు శుక్రవారం పంపిణీ చేశారు. ముద్దనూరు రోడ్డులోని విభిన్న ప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన కేకును కట్ చేసి అందించారు. అనంతరం 20 విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారను శివప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారికుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో వికలాంగులు నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య, సంయుక్తకార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

దొంగ పాలకులను ఓడించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న గుండ్లకుంట శ్రీరాములు

త్వరలో జరగబోయే ఎన్నికల్లో దొంగ పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు శుక్రవారం పిలుపునిచ్చారు. వైసిపి పాలనలో దొంగలే దొంగ దొంగ అని అరుస్తున్నారని, అమాయకులను కక్షపూరితంగా దొంగలుగా చిత్రీకరించేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. మభ్యపెట్టి, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన జగన్ ఐదేళ్లు రాష్ట్రాన్ని లూటీ చేశారని, మళ్ళీ ఆయనను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. హామీలను అమలు చేయకుండా మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ఏటా జనవరిలో డిఎస్‌సి విడుదల చేస్తామని చెప్పి ఇప్పటికి ఒక్కటి కూడా నిర్వహించలేదని తెలిపారు. మద్య నిషేధం పక్కనపెట్టి నకిలీ మద్యంతో ప్రజల జీవితాలను నాశనం చేశారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని ఇచ్చిన హామీ తుంగలో తొక్కి తొమ్మిది సార్లు ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని మాదకద్రవ్యాలకు నిలయంగా మార్చిందని మండిపడ్డారు. రాష్ట్రాన్ని గంజాయి మాఫియా నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు అనధికార సభ్యుల పదవీ కాలం కొనసాగింపును రద్దు చేయాలన్నారు.

వైసిపికి 'కొనిరెడ్డి' రాజీనామా

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కొత్తపల్లి సర్పంచ్ వైసిపి నాయకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని వైసిపి జిల్లా అద్యక్షుడు మేయర్ సురేష్‌బాబుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కొనిరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఎంఎల్‌ఎ రాచమల్లు ప్రసాదరెడ్డి దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని, ఈ పాలనను సహించలేక ,ఆ పార్టీలో తాను ఇమడలేక తాను రాజీనామా సమర్పించానని తెలిపారు.

'పైడిపాలెం'లో 4.45 టిఎంసిల నీరు నిల్వ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్‌లో 4.45 టిఎంసిల నీరు నిల్వ ఉన్నాయని గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ డిఇ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు సామర్థ్యం 6 టిఎంసిలు కాగా ఇప్పటివరకు రైతుల అవసరాల దృష్ట్యా హిమకుంట్ల , మల్లెల కాలువల ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం100 క్యూసెక్కుల నీరు మల్లెల కాలువ ద్వారా చెరువులకు నింపేందుకు విడుదల చేశామని తెలిపారు. రైతుల అవసరాల దృష్ట్యా హిమకుంట్ల కాల్వకు, మల్లెల కాల్వకు అదనంగా నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని అన్ని చర్చిలలో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక సిఎస్ఐ, ఎస్‌పిజి,(సిఎస్ఐ) ఆర్‌సిఎం, మన్నా, హెబ్రోన్, హోసన్నా,శాల ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ పాస్టర్ దేవసహాయం, నాలుగు రోడ్ల సమీపంలో ఉన్న సిఎస్ఐ(ఎస్పీజీ) చర్చిలో రెవరెండ్ పాస్టర్ సంతోష్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను ఏసు క్రీస్తు శిలువలో పలికిన మాటల గురించి వివరించారు. ఆర్‌సిఎం పాస్టర్ మర్రెడ్డి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు, వివిధ వేషధారణలతో సిలువను మోస్తూ క్రైస్తవులు పుర వీధుల్లో తిరిగారు. అనంతరం ఎల్ఎమ్ కాంపౌండ్‌లో భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. **పులివెందుల రూరల్ :** పట్టణంలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప ఆధ్వర్యంలో ఆర్‌సిఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అక్కడే దాదాపు 550 మందికి పైగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫాదర్ ప్రకాష్, సెయింట్ ఆన్స్ కాన్వెంట్ సిస్టర్స్ , స్టేట్ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, రాజారెడ్డి, చంద్రమౌళి, మౌళి, డేని, వెంకట్ నాథ్ రెడ్డి, శీను, రఫీ, పవన్, బాబు, చర్చి సంఘ సభ్యులు అందరూ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** కడప నగరంలోని డాన్ బోస్కో ఐటిఐ నుంచి ఆరోగ్యమాత చర్చి వరకు, ఆంతోని నగర్ నుంచి మాసాపేట సర్కిల్ మీదుగా చర్చి వరకు 14 గట్టాల సిలువ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ డైరెక్టర్ ఫాదర్ సన్ ఫాదర్ నాగిపోకు బాబు, ఫాదర్ సల్ల మనోహర్ ఆరోగ్యమాత, జేఎంజె చర్చి పెద్దలు, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

కడప నగరంలో శిలువ మోస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న వేషధారి

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - కడప

కడప నగరంలో రవీంద్ర నగర్‌లో నివసిస్తున్న దస్తగిరి(70) అనారోగ్యంతో మరణించారు. ఆయనకు అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ లేకపోవడంతో స్థానిక పోలీసుల అనుమతితో మేము సైతం సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అయ్యవారయ్య, రాము, రామరాజు, శివ, కిషోర్, గురవయ్య, సురేష్, నరసింహ, పుల్లయ్య, పాల్గొన్నారు.

అంత్యక్రియులు నిర్వహిస్తున్న మేముసైతం సేవాసంస్థ ప్రతినిధులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్	షహారీ
శనివారం (సా)	ఆదివారం (ఉ)
6.30	4.58

ఇంటింటి ప్రచారంలో హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కుప్పంలో టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - చక్రాయపేట

పులివెందుల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బిటెక్ రవి సోదరుడు జోగిరెడ్డి, మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కుప్పం పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారికి మహిళలు హారతి పళ్లెంతో స్వాగతం పలికారు. కుప్పం పంచాయతీలోని కొండుగారి పల్లె బలిజ పల్లె, వడ్డేపల్లి, హరిజనవాడ, కుప్పం గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం చేశారు. ఒక్కసారి అన్నకు ఓటు వేసి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తారని సోదరుడు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో చేరిన బి.కొత్తపల్లె వాసులు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి -ఖాజీపేట

అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, ప్రజలు అందరూ టిడిపికి పట్టం కట్టాలని మైదుకూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బి. కొత్త పల్లె గ్రామంలో సింగల్ విండో మాజీ అధ్యక్షులు ముత్తూరు రఘురామి రెడ్డి వర్గీయులు టిడిపిలో చేరారు. పుట్టా సుధాకర్ యాదవ్ వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకుంటేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి మల్హోత్రా, టిడిపి మండలం అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, సీనియర్ నాయకులు సందుల నాగ శివారెడ్డి, కూనవారిపల్లె సుబ్బిరెడ్డి, జెండాల మహబూబ్ బాషా, తవ్వా సుబ్బారెడ్డి, సుబ్బారామిరెడ్డి, ఎంపిటిసి చంద్ర భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి ఓట్లు అడగాలి : 'రాచమల్లు'

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

2014-2019 వరకు టిడిపి ప్రభుత్వం పాలనలో సిఎంగా చంద్రబాబునాయుడు, ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జిగా వరదరాజుల రెడ్డి ప్రొద్దుటూరులో ఎలాంటి అభివృద్ధి చేశారో చెప్పి ఓట్లు అడగాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వైసిపి నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి నివాస గృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడతూ చంద్రబాబు నాయుడు శనివారం ప్రొద్దుటూరుకు రానున్న సందర్భంగా ఈ లేఖను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. టిడిపి ఐదేళ్ల పాలనలో ప్రొద్దుటూరుకు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి ప్రజలను ఓటు అడగమని తెలిపారు. కేవలం రూ. కోటితో చేసిన అభివృద్ధి చెప్పాలన్నారు. పాఠశాల అభివృద్ధికి కనీసం రూ.లక్ష అయినా ఖర్చుపెట్టారా అని అడిగారు. ఒక చెల్లెమ్మకు ఇంటి నిర్మాణానికి జానెడు స్థలం అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. తాగేందుకు బిందెడు నీళ్లయినా ఇచ్చారా అన్నారు. ప్రొద్దుటూరు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి టిడిపి టికెట్ దక్కించుకున్న వరదరాజులరెడ్డి నామినేషన్ వేయాలని సూచించారు.

సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న బలగాలు, పోలీసులు

కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రొద్దుటూరు వన్‌టౌన్ సిఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పట్టణంలోని రామేశ్వరం, ఈశ్వర్ రెడ్డినగర్, పెన్నా నగర్, గవిని సర్కిల్, శివాలయం సర్కిల్ రహదారుల గుండా సిఆర్‌పిఎఫ్ కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. **రాజుపాలెం పరిధిలో..** సమస్యాత్మక గ్రామాలైన పగిడాల, అరకటవేముల, పర్లపాడు, చిన్నశెట్టిపల్లిలో రాజుపాలెం ఎస్‌ఐ తులసి నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్, సిఆర్‌పిఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు సంకల్పించారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని పోలీసు అధికారులు ప్రజల్లో భరోసా కల్పించారు.

అంగరంగ వైభవంగా ద్రౌపది కల్యాణం

ప్రజాశక్తి-కలకడ

ద్రౌపది కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు రామయ్య, వెంకటరమణ నాయుడులు తెలిపారు.మండలంలోని దేవళంపేటలో శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం ద్రౌపది పంచ పాండవుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రాల మధ్య మేళతాళాలతో నిర్వహించిన కల్యాణాన్ని భక్తులు వీక్షించారు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండల పరిధిలోని తొండలదిన్నె గ్రామానికి చెందిన నొస్సం బాబుషా (17) శుక్రవారం విద్యుత్‌షాక్ కొట్టి మృతి చెందినట్లు రాజుపాళెం ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. టంగుటూరు రహదారిలో నొస్సం సంజీవ కౌలుకు భూమిని తీసుకొని వరి పంటను సాగు చేసుకుంటున్నారు. ఆ పొలంలో నీరు పారించేందుకు ఆయన కుమారుడు బాబుషా అక్కడికి వెళ్లాడు. సాగునీటిని విడిచే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ మోటార్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కొట్టి అక్కడే కిందపడి మృతి చెందాడు. సంఘటనపై మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

కేక్ కట్ చేస్తున్న వి.ఎస్. అమీర్‌బాబు, ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి , నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ స్థాపించిన 9 నెలలకే అధికారం చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందని ఆ పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు, సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నగరంలోని రహమ్మతీయ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది శివ శంకర్ రెడ్డి , మాజీ సర్పంచ్ వెంకటేష్,మాజీ వార్డ్ మెంబర్ జయరాం రెడ్డి, పాలకొండ గుడి మాజీ ఛైర్మన్ ఓబుల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పిచ్చయ్య, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి సి. ఎస్. నాసర్ అలీ, తెలుగు యువత నగర మాజీ అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, పల్లె సుధాకర్ రెడ్డి, మురళీ మోహన్ రెడ్డి, నగర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి అశోక్, పుట్లం పల్లె రాజా యాదవ్, కొండాయ పల్లె శేషయ్య నాయుడు, తెలుగు యువత మాజీ ప్రధాన కార్యదర్శి హరినాథ్ రెడ్డి, గౌస్ పీరు, నగర మాజీ మైనార్టీ అధ్యక్షులు ఇమ్రాన్,47 వ డివిజన్ సీనియర్ నాయకులు, 40 వ డివిజన్ సీనియర్ నాయకులు రవీంద్రనాథ్, వీరభద్రయ్య, మాజీ కౌన్సిలర్ రామలక్ష్మమ్మ, స్వర్ణలత, నిర్మల, శ్రీదేవి చౌదరి, దేవి,స్వర్ణలత, మల్లేశ్వరి, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందుకు వెల్దామని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్దే లక్ష్యంగా నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. ఆయన స్ఫూర్తితోనే జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ్ రెడ్డి, చదిపిరాళ్ళ వేణుగోపాల్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** 42వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రొద్దుటూరు టిడిపి అభ్యర్థి నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణుల నడుమ నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరద టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శులు సిఎం సురేష్ నాయుడు, విఎస్ ముక్తియార్, మాజీ పట్టణ అధ్యక్షులు ఈవి సుధాకర్ రెడ్డి, 22వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ గౌస్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నల్లబోతుల నాగరాజు, యువ నాయకులు కొండారెడ్డి, బచ్చల ప్రతాప్, మైనారిటీ నాయకులు ఖలీల్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం ం పులివెందుల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను పులివెందుల టిడిపి నాయకులు మారెడ్డి జయభారతరెడ్డి, అజ్జగుట్టు రఘునాథరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, పార్టీ నాయకులు ఎగర వేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగట్ల మధుసూదన్ రెడ్డి, తొండూరు మండల టిడిపి ఇన్‌ఛార్జి శివమోహన్‌రెడ్డి, పులివెందుల పట్టణ టిడిపి అధ్యక్షులు ఆన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల రాఘవ రెడ్డి, నల్లగారి భాస్కర్ రెడ్డి, మారుతి రెడ్డి, గంగాధర్ రెడ్డి, కాసింవల్లి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల:** తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి నాయకులు మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి కార్యక్రమంలో సంజీవరెడ్డి ,రాజారెడ్డి,సేట్, రమేష్ నాయుడు, నాగభూషణం రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కలుషిత నీటితో పశువులకు ప్రమాదం

ప్రజాశక్తి-చాపాడు

మండల పరిధిలోని మడూరు గ్రామపంచాయతీ పరిధిలో పశువులు కలుషిత నీరు తాగడం,మునగడం సమస్యలు ఏర్పడు తున్నాయి. ప్రొద్దుటూరు నుంచి మండల పరిధిలోని చిన్న వరదాయపల్లి గ్రామం వద్దకు డ్రెయినేజీ మురుగునీరు వచ్చి చేరుతోంది. మేతకు వెళ్లే పశువులు డ్రెయినేజీలో కలియ తిరుగుతూ ఆ నీటిని తాగడం వల్ల అస్వస్థతకు గురవుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నీటి ఆధారంగా మెలకెత్తిన గడ్డి తినడం వల్ల కూడా పశువులు అనారోగ్య బారిన పడతాయని, పాడి రైతులు ఆ నీటిని తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఈ నీటిని తాగడం వల్ల 15 పశువులు అస్వస్థతకు గురైనట్లు మండల పశువైద్యాధికారి మొహమ్మద్ గౌస్ చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రొద్దుటూరు నుండి డ్రెయినేజీ నీటి వనరుల కింద ఉండే గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండి పశువులు తాగడానికి గ్రామ పంచాయతీ నీటిని వినియోగించాలని సూచించారు. పశువులకు ఏవైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులు డ్రెయినేజీ నీరు ప్రవహిస్తున్న కాలువలోకి పశువులు దిగకుండా ఏర్పాట్లు చేపడితే ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు కూడా కాలువ వైపు పశువులను వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రొద్దుటూరు నుంచి చాపాడు మండల పరిధిలోకి వస్తున్న డ్రెయినేజీ నీరు

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి : సిఐ

ప్రజాశక్తి-నందలూరు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని ప్రజలందరూ స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రాజంపేట రూరల్ సిఐ మంజునాథరెడ్డి పేర్కొన్నారు. ఎస్‌పి కృష్ణారావు, రాజంపేట డిఎస్‌పి చైతన్య ఆదేశాల మేరకు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బలగాలతో టంగుటూరు, పొత్తపి గ్రామాలలో కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి అందరూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. మండలంలో ఎటువంటి ఘర్షణలు జరిగిన కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. సార్వ త్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలకు విఘాతం కలుగ కుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా ప్రజలకు భద్రత కల్పించడానికి పోలీసు కవాతు నిర్వహించినట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.**రామాపురం :** 2024 మేలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండడానికి ఉన్నతాధికారి ఆదేశం మేరకు 60 మంది కేంద్ర బలగాలతో మండల కేంద్రంలో లక్కిరెడ్డిపల్లె సిఐ గంగాధర్‌బాబు, రామాపురం ఎస్‌ఐ ఎల్‌వి. ప్రసాద్‌రెడ్డి ఆధ్వ ర్యంలో శుక్రవారం సాయంత్రం మండలంలో సమస్యాత్మకమైన గ్రామాలైన ఎర్రంరెడ్డిగారిపల్లి, కల్పనాయిచెరువు, భయ్యారెడ్డిగారి పల్లి, కొత్తపల్లిలో పోలీస్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాల వెళ్లి నిర్భయంగా ఓటు హక్కు విని యోగించుకోవచ్చని తెలిపారు.

నందలూరు : కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఎంపీ

మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల కేంద్రంలోని హేమాచారి కల్యాణ మండపంలో కలికిరి మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 14 గ్రామ పంచాయతీ పరిధిలోని కార్యకర్తలను నాయకులను పిలిపించి గ్రామాలకు చెందిన కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి వివరించి గెలుపే లక్ష్యంగా పెట్టుకుని ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని కోరారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు జామియా మసీదులో నమాజ్‌కు వెళ్లి ముస్లిం మైనార్టీ నాయకులతో ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గొ న్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆగాముద్దీన్, పీలేరు నియో జకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజా లోకవర్ధన్, సీనియర్ నాయ కుడు నల్లారి తిమ్మారెడ్డి, జిల్లా ఎస్‌సిసెల్ కార్యదర్శి వి.హరి, సీనియర్ నాయకులు రాహుల్ చక్రవర్తిరెడ్డి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, సురేందర్ రెడ్డి, గంగయ్య, తస్లీమా రియాజ్, ఎంపిటిసి బోగేష్, వైస్ ఎంపిపి శ్రీకాంత్ యాదవ్, కో-ఆప్షన్ మెంబర్ రిజ్వాన్, అజయ్, ఖాదర్, జెఎసి వ్యవస్థాపకుడు హనీఫ్, వెంకటపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపితోనే ముస్లిం మైనార్టీలకు భవిష్యత్తు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపితోనే ముస్లిం మైనార్టీలకు భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని అన్నమయ్య జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం బి.కొత్తకోటలో పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేకనే జనసేన, బిజెపితో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. ఎన్‌ఆర్‌సి, సిఎఎ బిల్లుల నుంచి ముస్లిమలకు రక్షణ కల్పిస్తానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్ర బాబు మాటలు నమ్మే పరిస్థితుల్లో ముస్లిము మైనార్టీలు లేరని అన్నారు. మే 13న జరుగబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని, రాజంపేట పార్లమెంటు సభ్యులుగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మరోమారు గెలిపిం చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి డి.రియాసత్ అలీ ఖాన్, పిటిఎం ఎంపిపి మహమ్మద్, నాయకులు ఫజుల్ అలీ, కురబలకోట ఎంపిపి దస్తగిరి, వైసిపి స్టేట్ మైనారిటీ సెక్రటరీ ఎన్‌జిఒ మెంబర్‌మాలిక్ ఖాద్రి, వైసిపి ప్రచార కార్యదర్శి, అయూబ్ బాషా, మాజీ కో-ఆప్షన్ మెంబర్ అమీర్‌బాషా, గుమ్మడికాయల చాంద్ బాషా పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె : మండలంలో ఈ వేసవి కారణంగా గ్రామాలలో తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి ఆదేశించారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. బోరు మోటర్లు, స్టార్టర్‌లో ఎక్కడైనా మరమ్మతులకు గురైన వెంటనే స్పందించాలని తెలిపారు. ఎక్కడా సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ అశోక్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఇఒ తనిఖీ

తంబళ్లపల్లి : మండలంలోని కన్యమడుగు ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ నాగ సుబ్బరాయుడు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పిల్లల హాజరు, బోధనతీరు, తదితర అంశాలపై హెచ్‌ఎం వెంకట్రమణను అడిగి తెలుసు కు న్నారు. పిల్లల అభ్యసనా స్థాయిని గుర్తించేందుకు ప్రశ్నించారు. పిల్లలు సమా ధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉన్నత పాఠశాల మధ్యాహ్నం భోజన పథకం అమలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించండి

ప్రజాశక్తి -కడప అర్బన్

దేశవ్యాప్తంగా నిర్వహించబోయే సార్వత్రిక ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించాలని రెవల్యూషనరి సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జూపల్లి జానకిరాములు ప్రజలను కోరారు. నగరంలోని రాయలసీమ జోన్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సుబ్బారాయుడు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరాములు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదులు అరాచకాలు ఎక్కువ అయ్యాయని పేర్కొన్నారు. వాటిని ఎదుర్కోవాలంటే వామపక్ష పార్టీలు ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. బాండ్లతో కోట్లు రూపాయలు సొమ్ముచేసుకున్న బిజెపిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పౌర సత్వ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాదులకు బుద్ధి రావాలంటే రానున్న ఎన్నికల్లో బిజెపిని గద్దె దించి ఇండియా కూటమిని అధికారంలోకి తేవాలన్నారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆర్ ఎస్ పి అభ్యర్థులను ప్రకటించారు. సమావేశంలో ఆర్‌ఎస్‌పి నాయకులు కృష్ణవేణి, తిమ్మాక్క నరసింహ రావు, భాస్కర్, నరేంద్ర, నంద కిషోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారాన్ని శనివారం నుంచి చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, గంగాధర్ రెడ్డి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని, వైఎస్ అవినాష్ రెడ్డిని అఖండ మెజారిటీ తో గెలిపించాలని ప్రచారాన్ని చేయనున్నామని తెలిపారు. ఇంటి ఇంటికి ప్రచార కార్యక్రమం పార్నపల్లి రోడ్‌లో ఉన్న రాజీవ్ కాలనీ రింగ్ రోడ్ వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభం అవుతుందని, వైసిపికి సంబంధించిన ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పంటల మద్దతు ధరలకు చట్టపద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు గోగుల రమేష్, తిరుపాల్ రెడ్డి, శివ, బ్రహ్మం లో తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తమ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ప్రత్యేక మేనిఫెస్టో ఉంటుందన్నారు. మేనిఫెస్టో ప్రకారం ప్రతి ఏటా పేద మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సాయం చేస్తారన్నారు. పంట నష్టం జరిగిన నెల రోజులలోపే రైతులకు పరిహారం చెల్లిస్తారన్నారు. కార్మికులకు ఆరోగ్య హక్కు చట్టం అమలు చేస్తారన్నారు. రైతులకు రూ.3 లక్షల వరకు రుణమాఫీ ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేకహోదా, పోలవరం, రాజధాని నిర్మాణ బాధ్యత, కడపకు సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో వివరాలను తాము గడపగడపకు తెలియజేస్తున్నామన్నారు. పిసిసి చీఫ్ షర్మిలా రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి, డిసిసి ప్రెసిడెంట్ గుండ్లకుంట శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్ ఆదేశాల మేరకు తాము కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేస్తామన్నారు

రిమ్స్ ఆసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి -కడప అర్బన్

ఏ టా రి లక్షుమమ్మ ఛారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ (రిమ్స్) వద్ద శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 15వ డివిజన్ చెర్లోపల్లి గ్రామంలోని ఏటూరి లక్షుమ్మ 3వ వర్ధంతి సందర్భంగా ఏటూరి లక్షుమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మంది పేదలకు అన్నదాన చేసినట్లు ఏటూరి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటూరి నరసింహా రెడ్డి, ఏటూరి చంద్రా రెడ్డి, ఏటూరు పెంచల్ రెడ్డి, పాల్ఃరెడ్డి, ఏటూరు వినయ్ కుమార్ రెడ్డి, అల్లుడు మన్యం నాగేశ్వర్ రెడ్డి,కొడళ్లు, కూతుర్లు, మనవరాళ్లు, మనవళ్లు, బంధువులు పాల్గొన్నారు. **సాయిపేట మహేష్ ఆధ్వర్యంలో...** పాత రిమ్స్ ఆదరణ నిరశ్రయుల ఆదరణ కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. తన కష్టార్జితం లో అన్నం పెట్టడం సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా చేస్తామని చెప్పారు. అన్నదానంలో మహిధర్, చరణ్,అఖిల్ నిరాశ్రయులు పాల్గొన్నారు.

అన్నదాం చేస్తున్న ఏటూరి కుటుంబ సభ్యులు

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని ఓ కళాశాల విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ తెలిపారు. సిఐ వివరాల మేరకు..పట్టణంలోని వాయిలవంకలో నివాసముండే చిన్న నారాయణ కుమారుడు జి.రమణ గత కొద్దిరోజులుగా కళాశాల విద్యార్థినిని వేధిస్తూ, అసభ్యకరంగా వ్యవహరించేవాడని అన్నారు. సదరు విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిందితుడు రమణను రంగసముద్రం రోడ్డు, పాత ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అతనిని అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రిమాండ్ నిమిత్తం మదనపల్లి కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.